నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 21 జూన్ 2024 | KHAMMAM

ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో!

- కాంగ్రెస్ కోతల కరెంటుపై రైతుల ఆందోళన
- మళ్లీ చీకటి రోజులంటూ దిగులు
- కేసీఆర్ పాలన బాగుందంటున్న రైతాంగం
- అప్పుడు రెండు పంటలతో సంబురంగా సాగు



పెనుబల్లి/అశ్వారావుపేట రూరల్, జూన్ 20 : పదేళ్ల కేసీఆర్ పాలనలో 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ అందించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటలు పండించుకున్నారు. సాగును సంబురంగా చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందే తడవుగా విద్యుత్ కోతలు పెట్టడమే పనిగా పెట్టుకున్నది. రైతులు పంట చేల వద్ద విద్యుత్ కోసం రేయింబవళ్లు పడిగాపులు కాసేలా చేసింది. పంటలను ఎండిపోయేలా చేసింది. రైతులను మళ్లీ అప్పుల ఊబిలోకి నెట్టింది. ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో అర్థంకాని పరిస్థితులను తీసుకొచ్చింది. మళ్లీ పాత రోజులే వచ్చాయని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది కూడా ఇలాగే కోతలు పెడితే పంటలు ఎలా పండించుకోవాలని దిగులు చెందుతున్నారు. గత కేసీఆర్ పాలనలో 24 గంటలపాటు అందించిన కరెంటునే రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

మోటర్ల కాడ కాపలా ఉన్నాం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మోటర్ల వద్ద అర్ధరాత్రులు కాపలా పడుకున్నాం. ఏ సమయంలో కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో బోరుబావుల వద్ద ఎదురు చూసేవాళ్లం. తెలంగాణ ఏర్పడి.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ అందించడం వల్ల రాత్రులు కాపలా పోయింది. నిరంతర విద్యుత్ వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయం సక్రమంగా సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఇప్పుడు గంటకు రెండుసార్లు విద్యుత్ అంతరాయం, ఎటువంటి ఇబ్బందులు లేకున్నా సరే ఏదో ఒక సాకుతో కరెంటు కట్ చేస్తున్నారు. దీంతో రైతులు, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. **– కోమటి ప్రసాద్, బయ్యన్నగూడెం, రైతు**

గతంలో ఇలా కరెంట్ పోలే..

తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనలో పదేళ్లుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ ఇవ్వడం వల్ల అందరికీ ఉపయోగంగా ఉంది. కానీ.. ఇటీవలి కాలంలో కొద్దిపాటి చినుకులు పడినా, గాలి దుమ్ము వచ్చినా విద్యుత్ అంతరాయమే. ఒక్కోసారి ఎటువంటి ఇబ్బంది లేకున్నా కరెంట్ పోవడంతో ఏ సమయంలో కరెంట్ వస్తుందో.. పోతుందో.. తెలియని పరిస్థితి ఉంది. విద్యుత్‌పై నిరంతరం ఆధారపడి పని చేసుకునే వారికి కరెంట్ కష్టాలు తప్పవన్నట్లుగా ఉంది. ఇప్పుడే ఇలా ఉంటే.. రాబోయే వర్షాకాలంలో వర్షాలకు విద్యుత్ అంతరాయం ఏ విధంగా ఉంటుందో అర్థం కావడం లేదు. చిమ్మ చీకట్ల నుంచి తెలంగాణ వచ్చాక వెలుగులు నింపి.. మళ్లీ చీకట్లో పడినట్లు అవుతుంది.

– వేముల నరేంద్ర, ఎలక్ట్రీషియన్, వీఎం బంజర

తరచూ అంతరాయంతో అవస్థలు

కరెంటు తరచూ వస్తూ.. పోతుండడంతో ఇబ్బందిగా ఉంది. రాత్రి పూట సరిగా నిద్ర కూడా ఉండటం లేదు. ఎన్నిసార్లు వస్తుందో.. పోతుందో తెలియదు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇంత ఇబ్బంది పడలేదు. కరెంటు పోయిన వెంటనే మళ్లీ వచ్చేది. పశువుల మేత కోసం వేసిన గడ్డికి కరెంటు సరిగా లేకపోవడంతో నీరందక ఎండిపోయింది. ఇప్పుడు వర్షాలు కురుస్తుండడంతో ఆ గడ్డికి మళ్లీ ప్రాణం వచ్చినట్లైంది. కరెంటు సక్రమంగా లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నాం. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– నాగేశ్వరరావు, అశ్వారావుపేట

ఒకవైపు నకిలీ.. మరోవైపు బ్లాక్!

తీవ్రంగా నష్టపోతున్న రైతన్నలు

మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

విత్తనాల కోసం అన్నదాతలకు తప్పని ఇక్కట్లు

ఒకవైపు నకిలీ విత్తనాలు.. మరోవైపు బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు, ఎరువుల అమ్మకాలు.. రైతన్నలను తీవ్ర నష్టానికి గురిచేస్తున్నాయి. విత్తనాల కొనుగోలు మొదలు పంటల అమ్మకాల వరకు అన్నదాతలు ఏదోరూపంలో మోసపోతూనే ఉన్నారు. రైతులను కంటికిరెప్పలా కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులు మాత్రం మొక్కుబడి చర్యలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుత వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో విత్తన డీలర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ కర్షకులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. నకిలీ, బ్లాక్ దందాను అరికట్టాల్సిన అధికారులు మొక్కుబడి తనిఖీలు, అడపాదడపా కేసులు నమోదు చేస్తూ మిన్నకుండిపోతున్నారు. ఏదేమైనా అన్నదాతల కష్టాలను పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రతి ఏడాది వారికి ఇక్కట్లు తప్పడం లేదు.

బ్లాక్‌లో విక్రయిస్తున్న పత్తి సీడ్ ప్యాకెట్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : విత్తన డీలర్లకు పరీక్షలు పెట్టి సర్టిఫికెట్లు ఇచ్చి, ఎన్ని సమావేశాలు పెట్టినా అవి మొక్కుబడిగానే మిగిలిపోతున్నాయి. రైతన్నలు నిత్యం మోసపోతూనే ఉన్నారు. నకిలీ విత్తనాలు, బ్లాక్‌లో విత్తనాలు, ఎరువుల అమ్మకాలు రైతులకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి. వానకాలం సీజన్ వచ్చినప్పుడల్లా టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు దాడులు చేయడం, మొక్కుబడి తనిఖీలు చేయడమే తప్ప నకిలీలను పట్టుకొని కేసులు పెడుతున్న సందర్భాలు తక్కువగానే ఉన్నాయి. దీంతో రైతులు బ్లాక్‌లో విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయలేక పెట్టుబడి తలకు మించిన భారంగా మారుతున్నది. రైతులకు మరింత మేలు చేకూరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మేలేమో గానీ ఇబ్బందులు బాగా కనిపిస్తున్నాయని రైతులు బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. రైతుబంధు సొమ్ములు ఖాతాల్లో జమకాకపోవడంతో పెట్టుబడికి నానా కష్టాలు పడుతున్నారు.

బ్లాక్‌లో విత్తనాలు...

అధికారుల చూపు నకిలీ విత్తనాలపైనే ఉంది. కానీ.. బ్లాక్ మార్కెట్‌లో విత్తన విక్రయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలు జిల్లావ్యాప్తంగా విత్తన, ఎరువుల షాపులను తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నది. రైతులకు కావాల్సిన విత్తనాలు వారికి అందడం లేదు. ఇదే అదునుగా విత్తన డీలర్లు బ్లాక్‌లో ఎక్కువ ధరకు విత్తనాలను విక్రయిస్తున్నారు. పత్తి యూఎస్ 7067 రకం దిగుబడి ఎక్కువ ఉందని రైతులు అడుగుతుండడంతో డీలర్లు మాత్రం స్టాక్ లేదంటూ వేరే విత్తనాలను అంటకడుతున్నారు. ఆర్‌సీహెచ్ 659 రకం కూడా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ రకం విత్తనాలను బ్లాక్ చేసి ఎంఆర్‌పీ కంటే మూడు రెట్లు ఎక్కువగా విక్రయిస్తున్నారు. దీంతో రైతులు తప్పని పరిస్థితుల్లో రూ.1,800 నుంచి రూ.2,000 వరకు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి. కొత్తగూడెం, సుజాతనగర్, జూలూరుపాడు, టేకులపల్లి మండలాల్లో ఇలాంటి విత్తనాల దందా యథేచ్ఛగా సాగుతున్నది. రైతులు చేసేదేమీలేక ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

కావాల్సిన విత్తనం దొరకట్లే..

ఈ ఏడాది వానకాలం పంటకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 4,87,312 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్లు ప్రణాళికను తయారు చేశారు. ఇందుకోసం 4,394 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పత్తి 2,16,625 ఎకరాల్లో పంటను సాగు చేయనున్నారు. దీనికిగాను 5,41,560 ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటుంది. వరి 1,65,854 ఎకరాలకు 41,464 క్వింటాళ్ల విత్తనాలు కావాల్సి ఉంది. మొక్కజొన్న 60,200 ఎకరాలకు 4,816 క్వింటాళ్ల విత్తనాలు, మిర్చి 32,168 ఎకరాలకు 32 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా.. డీలర్ల వద్ద సరిపడా అందుబాటులో ఉంచారు. అయితే విత్తనాల కొరత ఎట్లా వస్తుంది అనేది ఆ శాఖ అధికారులకే తెలియాలి. అవసరం ఉన్న విత్తనాలు తేకుండా డిమాండ్ లేని విత్తన రకాలు మార్కెట్లోకి తీసుకొచ్చి క్వింటాళ్ల లెక్కలు చూపెట్టడం వల్ల రైతులకు కావాల్సిన విత్తనాలు దొరకడం లేదు.

బ్లాక్‌లోనే అమ్ముతున్నారు..

మాకు కావాల్సిన విత్తనాలు అడిగితే లేవంటున్నారు. 7067 రకం రూ.2 వేల వరకు అమ్మేస్తున్నారు. అంత రేటు పెట్టి కొని వ్యవసాయం ఎట్లా చెయ్యాలి. పోయిన సంవత్సరం పత్తి మీద చాలా నష్టం వచ్చింది. కూలీలు కూడా సరిగా దొరకరు. బయట నుంచి తేవాల్సి వస్తున్నది. మిర్చి వేస్తే వైరస్ వచ్చి పోయింది. మాకు సలహాలు ఇచ్చే వాళ్లు లేరు. పత్తికి ప్రభుత్వం రేటు పెంచాలి.

– జోయినబోయిన ఐలయ్య, రైతు, డేగలమడుగు

అధికారులు నిఘా పెట్టాలి..

కొంతమంది వ్యాపారులు విత్తనాలను కావాలనే బ్లాక్ చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో రైతులు ఎక్కువ ధరకు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. అధికారులు షాపులను తనిఖీ చేస్తూనే ఉన్నారు.. అయినా వారి కన్నుగప్పి కొందరు బ్లాక్ వ్యాపారం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి విత్తనాలు వస్తున్నట్లు తెలిసింది. అధికారులు పక్కగా నిఘా పెడితే తప్ప సమస్య పరిష్కారం కాదు.

– ఇస్లావత్ బాలు, సంపత్‌నగర్, టేకులపల్లి మండలం

ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాం..

నకిలీ విత్తనాలు ఎక్కడా లేవు. జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. అన్ని షాపుల వద్ద విత్తనాలు, ఎరువులు ఫుల్‌గా ఉన్నాయి. బ్లాక్‌లో అమ్ముతున్నారు అనేది వాస్తవం కాదు. సమాచారం ఇస్తే రైతుల పేర్లు చెప్పకుండా తనిఖీలు చేస్తాం.. షాపును సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

– బాబూరావు, డీఏవో, భద్రాద్రి కొత్తగూడెం

చదువుతోనే మంచి భవిష్యత్

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మద్దుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులకు ఆదేశాలు ఇస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చండ్రుగొండ/పాల్వంచ, జూన్ 20 : విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. గురువారం మద్దుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించడంతోపాటు విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు క్రమం తప్పకుండా వెళితే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమవుతాయని, విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచిత విద్యతోపాటు పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నదని చెప్పారు. పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే మద్దుకూరుకు చెందిన ఉపాధిహామీ కూలీలు కలెక్టర్‌ను కలిసి ఫీల్డ్ అసిస్టెంట్‌పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాల్వంచలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. స్వయంగా పిల్లలకు మాత్రలు వేశారు. ప్రతీ ఆరు నెలలకు ఒక సారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత, దుర్గా, ఎన్.క్రాంతి, బి.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మధువరన్, డాక్టర్ బాలాజీ, సీహెచ్‌వో నాగభూషణం, డిప్యూటీ డెమో ఎండీ ఫయాజ్ మొహినుద్దీన్, చండ్రుగొండ తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, పీఆర్ ఈఈ సత్యనారాయణ, ఎంఈవో సత్యనారాయణ, సీడీపీవో నిర్మలా జ్యోతి, ఏఈ శ్రీనివాస్, హెచ్ఎం భవాని పాల్గొన్నారు.

'నులి'పేశారు..

- 3,19,501 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- జిల్లాలో 95 శాతం పూర్తయిన కార్యక్రమం

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : 'నులిపురుగులను నులిపేద్దాం–ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదాన్ని ఎత్తుకున్న వైద్యారోగ్య శాఖ జిల్లాలో గురువారం డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పాల్వంచ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పిల్లలకు మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ ఆరోగ్య కేంద్రంలో పిల్లకు మాత్రలు వేశారు. జిల్లావ్యాప్తంగా 3,36,136 మంది పిల్లలు ఉండగా.. తొలిరోజు 3,19,501 మందికి మాత్రలు వేయగా.. మొత్తం 95 శాతం ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 27న మాపప్ డే కార్యక్రమంలో మిగిలిన పిల్లలకు మాత్రలు వేయనున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు పిల్లలకు మాత్రలు వేసి కార్యక్రమాన్ని చేపట్టారు. చుంచుపల్లిలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు పిల్లలకు మాత్రలు వేశారు.

'ఆధునిక' సాగుతోనే దిగుబడులు

అవగాహన సదస్సులో ఖమ్మం డీఏవో విజయనిర్మల

నేలకొండపల్లి : మాట్లాడుతున్న డీఏవో విజయనిర్మల

కూసుమంచి(నేలకొండపల్లి), జూన్ 20 : ఆధునిక పద్ధతిలో సాగు చేయడం వల్ల మంచి లాభాలు ఉంటాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) విజయనిర్మల అన్నారు. నేలకొండపల్లిలోని వాసవీ భవన్‌లో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాతే పంటలు సాగు చేయాలని కోరారు. భూమిని సారవంతం చేయడానికి పశువుల ఎరువును సాగు భూముల్లో చల్లాలని, మంచి దిగుబడుల కోసం మేలైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. రైతులు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న వాటికి తప్పక రసీదులు తీసుకోవాలని సూచించారు. ఉద్యానవన పంటలు, ఎరువుల మోతాదు, కీటకాల బారి నుంచి రక్షించుకునే విధానంపైన జిల్లా అధికారి రమణ, మధిర వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు రుక్మిణీదేవి, కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ నాగస్వాతి, ఏడీఏ విజయ్‌చంద్ర వివరించారు. అనంతరం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. సదస్సులో జిల్లా రైతు బాధ్యులు నల్లమల వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి అరుణ, మదాఖాన్ కేన్ అధికారి అప్పారావు, సొసైటీ కార్యదర్శి లింగస్వామి, కోశాధికారి దండా రవీంద్రబాబు, రైతు కమిటీ బాధ్యులు మచ్చా రఘుపతి, ఎలమద్ది లెనిన్, గణపతిరావు, వెల్లపల్లి శ్రీనివాసరావు, నెల్లూరి వీరబాబు, భాస్కర్‌రావు, వెంకటాచారి, తిరుపతయ్య, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను.. సమర్థంగా ఎదుర్కోవాలి

- వాటి నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలి
- ధరణి పోర్టల్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
- చింతకాని పర్యటనలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పీహెచ్‌సీ వైద్యుడు ఆల్తాఫ్‌కు సూచనలిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

చింతకాని, జూన్ 20: ఈ వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధులను ఆయా శాఖల అధికారులు సమర్థంగా ఎదుర్కోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. వ్యాధుల నివారణ కోసం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత గురించి వారికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. చింతకాని మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. వివిధ ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థల సేకరణ, రిజిస్ట్రేషన్ల వివరాలు, ధరణి పెండింగ్ సమస్యలు, రైతుల వినతులు తదితర వివరాల గురించి డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం చింతకాని పీహెచ్‌సీకి వెళ్లి అక్కడి రోగులను పలుకరించి వారి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. రోగులు పోషకాహారం తీసుకోవాలని, గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు రాబోయే మూడు నెలలపాటు నిత్యం పల్లెల్లో అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నేలపైనే కూర్చొని చిన్నారుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మండల వైద్యాధికారి ఆల్తాఫ్, ఎంపీవో రవీంద్రప్రసాద్, డీటీ వీరభద్రనాయక్, గిర్దావర్ ఉష, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, రెండు రోజుల క్రితం కలెక్టర్‌గా విధుల్లో చేరిన ముజమ్మిల్ ఖాన్.. గురువారం నాటి చింతకాని పర్యటనలో సామాన్యుడిలా వ్యవహరించారు. అటు అధికారులతోనూ, ఇటు ప్రజలతోనూ ఆయన మమేకమైన తీరు అతడి నిరాడంబరతకు అద్దం పట్టింది. కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను చూసి గౌరవపూర్వకంగా సిబ్బంది లేచినప్పటికీ వారిని వారించి వారి పక్కనే కూర్చొని విధుల గురించి వాకబు చేశారు. గెజిటెడ్ సంతకం కోసం పీహెచ్‌సీకి వచ్చిన ఓ మహిళను పలుకరించి సమస్యను అడిగి తెలుసుకొని స్వయంగా తానే సంతకం చేశారు.

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో..

కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి

తెలంగాణ బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలి

మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణకు చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వద్ద కిషన్ రెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకుంటే రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వెళ్లి ప్రధానిని కలిసి సింగరేణి బొగ్గు గనులు వేలం వేయొద్దని కోరతామని అన్నారు. వాటిని బహిరంగ వేలం వేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాగమయి, రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌లతో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడారు. బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుందని అన్నారు. సింగరేణి కార్మికుల భవిత ఆధారపడి ఉన్నందున బొగ్గు గనులను వేలం వేయవద్దని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంగా ఉన్న సింగరేణి సంస్థకే ఆ గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను వదులుకోబోమని అన్నారు. సింగరేణికి గనులు కేటాయించేందుకు ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసే విషయంలో అఖిలపక్షంతో బీఆర్ఎస్ కూడా కలిసి రావాలని సూచించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సింగరేణి దివాలా తీయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ మీద ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.